‘పోషణ పక్వాడ’ ప్రారంభం

- అంగన్‌వాడీ కేంద్రాల్లో 22వరకు కార్యక్రమాలు



మంచిర్యాలటౌన్‌: అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్‌ రమాదేవి

మంచిర్యాలటౌన్‌/తాండూర్‌/లక్సెట్టిపేట/జన్నారం/కాసిపేట/దండేపల్లి: అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం పోషణ పక్వాడ కార్యక్రమం ప్రారంభమైంది. ఈ నెల 22వరకు కార్యక్రమాలు కొనసాగనున్నట్లు ఐసీడీఎస్‌ అధికారులు తెలిపారు. గర్భిణులు ఆరోగ్య నియమాలు పాటించాలని, బలవర్ధకమైన ఆహారం తీసుకొని రక్త హీనత లేకుండా చూసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందజేస్తున్న పోషకాహారాన్ని తప్పక తీసుకోవాలని, క్రమం తప్పక ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ఏసీసీ అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్‌ సూపర్‌వైజర్‌ రమాదేవి పాల్గొని గర్భిణులు రక్తహీనత నివారణకు ఆకుకూరలు, కూరగాయలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్‌ ఎస్‌. పద్మ, సహాయకురాలు లత పాల్గొన్నారు. దండేపల్లి మండలంలోని వెల్గనూర్‌ అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్‌ సూపర్‌వైజర్‌ వెంకటలక్ష్మి గర్భిణులకు, బాలింతలకు అవగాహన కల్పించారు. ఐరన్‌, కాల్షియం మాత్రలు వేసుకోవాలన్నారు. అంగన్‌వాడీ టీచర్లు శైలజ, లక్ష్మి, ఆశ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు. కాసిపేట మండలంలోని బుగ్గగూడెం అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్‌ మండల సూపర్‌వైజర్‌ రాధిక పోషన్‌ పక్వాడను ప్రారంభించారు. చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్‌ రాజమణి, ఆశ వర్కర్‌, గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పాల్గొన్నారు. జన్నారం–2 అంగన్‌వాడీ సెంటర్లో గర్భిణులకు, తల్లులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్‌ పద్మ, అంగన్‌వాడీ టీచర్లు సుజాత, సునీత, పార్వతి ఉన్నారు. లక్సెట్టిపేట మండలంలోని వెంకట్రావుపేట సెక్టార్‌ పరిధిలోని జెండావెంకటాపూర్‌ గ్రామంలో ఐసీడీఎస్‌ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. చిన్నారులకు అన్నప్రాసన చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్‌ సూపర్‌వైజర్‌ వాణి, టీచర్లు నీరజ, తిరుమల, సిబ్బంది పాల్గొన్నారు. తాండూర్‌ ఐబీ ఏరియా–1 అంగన్‌వాడీ కేంద్రంలో బెల్లంపల్లి సీడీపీవో స్వరూపారాణి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్‌, ఎంఈవో మల్లేశం, సూపర్‌వైజర్లు రమాదేవి, ప్రసన్న, ఏఎన్‌ఎం, అంగన్‌వాడీ టీచర్లు లీలారాణి, రాజేశ్వరి, లక్ష్మి, ఉమారాణి, చిన్నారులు, తల్లులు పాల్గొన్నారు.



దండేపల్లి: మాట్లాడుతున్న సూపర్‌వైజర్‌



అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్‌ పద్మ



జెండావెంకటాపూర్‌లో ...

మొహిబిన్‌పేట రేవు.. ప్రమాదాలకు నెలవు

- సూచికబోర్డులు ఏర్పాటు చేయాలని ప్రజల వేడుకోలు



మొహిబిన్‌పేట రేవు

వేమనపల్లి: ప్రాణహిత నది మొహిబిన్‌పేట రేవు ప్రమాదాలకు నిలయంగా మారింది. ఈ రేవు వద్ద ఏటా నీళ్ల తగ్గుముఖం పట్టి సాచ్చిరేవులు ఏర్పడతాయి. అవతలి వైపు ఉన్న మహారాష్ట్ర, ఇవతలి వైపు ఉన్న తెలంగాణ సరిహద్దు గ్రామాల ప్రజలు ఈ రేవు గుండా కాలినడకన రాకపోకలు సాగిస్తారు. దాటే క్రమంలో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. సుమారు కిలోమీటర్‌ వెడల్పు ఉన్న ప్రాణహిత నది ఎండాకాలం వరద తగ్గి కేవలం 30నుంచి 40మీటర్ల వెడల్పుతో మాత్రమే ప్రవహిస్తోంది. దీంతో అక్కడ లోతు, వరద తీవ్రత, వరద తాకిడి ఎక్కువగా ఉంటోంది. గత నెలలో మండల కేంద్రానికి చెందిన కంపెల రాజ్‌కుమార్‌ ప్రాణహిత స్నానానికి వెళ్లి మృతి చెందగా ఈ ప్రమాదకర రేవు తీవ్రత మళ్లీ వెలుగులోకి వచ్చింది. ఏడాది క్రితం ఒడ్డుగూడంకు చెందిన గగ్గూరి శంకర్‌ అనే బోట్‌ రైడర్‌ వరద నీటిలో మునిగి మృతి చెందాడు. రెండు సంవత్సరాల క్రితం మొహిబిన్‌పేటకు చెందిన దున్న శైలేష్‌ పుణ్యస్నానానికి వచ్చి జలసమాధి అయ్యాడు. రెండు రోజులు వెతకగా మృతదేహం ఆచూకీ దొరికింది. గత 14సంవత్సరాల క్రితం మండల కేంద్రానికి చెందిన చల్ల పున్నం అనే యువకుడు కాలినడకన మేకల మందతో దాటుతుండగా గల్లంతయ్యాడు. అతడితో పాటు 20మేకలు కూడా వరదలో కొట్టుకుపోయాయి. ఇప్పటికీ పున్నం పోలీసు రికార్డుల్లో ఆచూకి దొరకని వ్యక్తిగానే మిగిలిపోయాడు. ఈ రేవు పేరు చెబితేనే ఇరు రాష్ట్రాల సరిహద్దు గ్రామాల ప్రజలకు ప్రమాదాలకు నిలయంగా మారిపోయింది. అధికారులు స్పందించి వరద ప్రవాహం ఎక్కువగా ఉన్న ఈ ప్రాంతంలో ప్రమాద సూచికలు ఏర్పాటు చేస్తే మంచిదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

కన్నయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి



నిరసన తెలుపుతున్న ఆదివాసీ నాయకులు

వేమనపల్లి: యజమాని వేధింపులతో మృతి చెందిన పాలేరు నాయిని కన్నయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా నాయకురాలు మల్లేశ్వరి డిమాండ్‌ చేశారు. మండలంలోని బుయ్యారంలో నిరసన తెలిపారు. కన్నయ్య చావుకు కారకులైన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలన్నారు. కన్నయ్య కుటుంబానికి చెందిన ఎకరం సీలింగ్‌ పట్టా భూమిని యజమాని చిన్నన్న తన కొడుకు హరీష్‌ పేరు మీద అక్రమంగా లాక్కుని పట్టా చేసుకున్నాడని, దీనిపై విచారణ జరిపి కన్నయ్య కుటుంబానికి ఇప్పించాలన్నారు. ఈ విషయమై స్థానిక ఎమ్మెల్యే, ఉన్నతాధికారి స్పందించి కుటుంబానికి న్యాయం జరిగేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు రామయ్య, లక్ష్మి, రాజన్న, కమల, బుచ్చక్క, జయ దుర్గక్క పాల్గొన్నారు.

క్లుప్తంగా

రెస్క్యూ చేసి.. కుక్కను రక్షించి



బయటకు తీసిన కుక్కపిల్లతో ఫైర్‌ సిబ్బంది

జన్నారం: ప్రమాదవశాత్తు బావిలో పడిన కుక్క పిల్లను ఫైర్‌ సిబ్బంది రెస్క్యూ చేసి రక్షించారు. మండలంలోని పొనకల్‌ గాంధీనగర్‌కు చెందిన నగూరి భాగ్యలక్ష్మి ఇంటిలో గల బావి లో కుక్క ప్రమాదవశాత్తు పడింది. అది అరవడంతో పరిసర ప్రాంతాల వారు ఫైర్‌ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. ఫైర్‌ అధికారి శ్రీనివాస్‌ సిబ్బందితో కలిసి ఆ ప్రాంతానికి వెళ్లి బావిలో పడిన కుక్కను గమనించి, తాళ్ల సహాయంతో బయటకు తీశారు. ఇలాంటి ప్రమాదకరమైన సంఘటనలు ఎదురైనప్పుడు ఫైర్‌ అధికారులకు సమాచారం ఇవ్వాలని ఫైర్‌ అధికారి శ్రీనివాస్‌ సూచించారు.

డబుల్‌ రోడ్డు నిర్మించాలని ధర్నా



ధర్నా చేస్తున్న గ్రామస్తులు

భీమిని: మండల కేంద్రంలో డబుల్‌ రోడ్డు నిర్మించాలని మంగళవారం గ్రామస్తులు ధర్నా చేపట్టారు. ఆర్‌అండ్‌బీ అధికారులు నిధులులేవనే సాకుతో భీమిని మండల కేంద్రంలో సింగిల్‌ రోడ్డు వేస్తుండటంతో ప్రయాణం ఇబ్బందికరంగా మారిందని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి డబుల్‌ రోడ్డు వేయాలని డిమాండ్‌ చేశారు. లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. ఈ విషయంపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

నేడు విద్యుత్‌ సరఫరాలో అంతరాయం

చెన్నూర్‌: చెన్నూర్‌ శివాలయం సబ్‌స్టేషన్‌తో పాటు కోటపల్లి మండలంలోని పారుపల్లి కొత్త బ్రిడ్జ్‌ వద్ద గల 33కేవీ లైన్‌ మరమ్మతులు నిర్వహిస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్‌ తెలిపారు. సబ్‌స్టేషన్‌, లైన్ల మరమ్మతుల కారణంగా చెన్నూర్‌ శివాలయం ఏరియాతో పాటు కోటపల్లి మండలం ఆలుగాం, దేవులవాడ సబ్‌స్టేషన్‌ పరిధిలోని గ్రామాలకు బుధవారం మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్‌ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. విద్యుత్‌ వినియోగదారులు సహకరించాలని కోరారు.

మతోన్మాదానికి వ్యతిరేకంగా నిరసన

బెల్లంపల్లి: కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం మతోన్మాద విధానాలను అవలంభిస్తోందని ఆరోపిస్తూ మంగళవారం బెల్లంపల్లిలో సీపీఐఎంఎల్‌ మాస్‌లైన్‌ ప్రజాపంథా శ్రేణులు నిరసన చేపట్టారు. పట్టణంలోని అంబేడ్కర్‌ చౌరస్తాలో నిరసన నిర్వహించి బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కార్యదర్శి జాడి దేవరాజ్‌ మాట్లాడుతూ.. దేశంలో వరుసగా మూడోసారి అధికారాన్ని చేపట్టిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను పూర్తిగా విస్మరించారని విమర్శించారు. మతోన్మాద చర్యలకు పాల్పడుతూ దేశాన్నీ అధోగతి పాల్జేస్తున్నారని ఆరోపించారు. ప్రజలు సంఘటితమై బీజేపీ ప్రభుత్వ విధానాలను ఎండగట్టాలని కోరారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు రమాదేవి, సాజిద్‌, రమేష్‌, శంకర్‌, తిరుపతి, సారన్న పాల్గొన్నారు.

విద్యతో పాటు ఆటల్లో రాణించాలి



నృత్యం చేస్తున్న విద్యార్థులు

చెన్నూర్‌: విద్యార్థులు విద్యతో పాటు ఆటల్లో రాణించాలని చెన్నూర్‌ సీఐ దేవేందర్‌రావు అన్నారు. స్థానిక శార్వాణి ఇంగ్లిష్‌ మీడియం పాఠశాల రెండో వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. అనంతరం నవోదయలో సీట్లు సాధించిన రాష్ట్ర, జాతీయ స్థాయి కరాటే, అథ్లెటిక్స్‌ పోటీల్లో రాణించిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎంఈవో రాధాకృష్ణమూర్తి, భీమారం ఎస్‌హెచ్‌వో శ్వేత, కళాశాల అధ్యాపకులు అనిల్‌, మేడ శ్రావణ్‌కుమార్‌రెడ్డి, కోర్‌ాళ్ల శ్యాంసుందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పంటలు ఎండుతున్నా పట్టించుకోరా..?

- డిస్ట్రిబ్యూటరీ 19, 22 కింది రైతుల ఆవేదన



నీరు లేక ఎండిన ఆకుల రవి వరి పంట

జన్నారం: కడెం కెనాల్‌ కింద పండించిన వరి పంట ఎండుతున్నా అధికారులు ఎవ్వరూ పట్టించుకోరా అని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జన్నారం మండలం తపాలపూర్‌లో కడెం కెనాల్‌ డిస్ట్రిబ్యూటరీ నంబర్‌ 19, 22ల పై ఆధారపడి గ్రామానికి చెందిన పలువురు రైతులు రబీ పంట వేసుకున్నారు. అధికారులు రబీ పంటకు నీరందిస్తామని తెలిపారు. కానీ కాలువ నుంచి సరిపడా నీరు రాకపోవడంతో వందల ఎకరాల్లో వరిపంట ఎండుతున్నట్లు రైతులు కమ్మల విజయధర్మా, ఆకుల రవి, మామిడి భూమన్న, లచ్చన్న, బుటికె కొమురయ్య, జెల్ల రాజయ్య ఆవేదన వ్యక్తం చేశారు. నీరు సరిపడా లేక మూడెకరాలకు గాను ఎకరం భూమి వదిలేసినట్లు, నీరు రాకపోతే రెండు ఎకరాలు కూడా ఎండిపోయే ప్రమాదముందని రైతు ఆకుల రవి వాపోయారు. రైతుల బాధను గుర్తించి అధికారులు నీరందించకుంటే రాంపూర్‌, తిమ్మాపూర్‌, తపాలపూర్‌, సింగరాయిపేట గ్రామాల్లో వంద ఎకరాల్లో వరిపంట ఎండిపోయే ప్రమాదం ఉంద ని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు రైతులకు సహకరించాలని కోరారు.

అసాంఘిక శక్తులకు సహకరిస్తే చర్యలు



జాలర్లతో మాట్లాడుతున్న సీఐ

కోటపల్లి: సంఘవిద్రోహ చర్యలకు పాల్పడుతున్న అసాంఘిక శక్తులకు సహకరిస్తే చర్యలు తప్పవని సీఐ సుధాకర్‌ హెచ్చరించారు. మండలంలోని వెంచపల్లి సమీపంలోని ప్రాణహిత నది సరిహద్దు ప్రాంతాల్లోని ఫెర్రి పాయింట్లను మంగళవారం సందర్శించి జాలర్లతో, పడవల యజమానులతో మాట్లాడారు. సరిహద్దుల్లో అనుమానాస్పదంగా ఎవరైనా సంచరించినా, కదలికల్లో తేడా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. సరిహద్దు గుండా వచ్చిపోయే ప్రయాణికుల వివరాలను అడిగి నమోదు చేసుకున్నారు. అనంతరం వెంచపల్లి గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేసి సీసీ కెమెరాల ఏర్పాటుకు గ్రామస్తులు సహకరించాలని సూచించారు. సైబర్‌ మోసాలతీరు, గంజాయి డ్రగ్స్‌ వల్ల కలిగే దుష్ప్రభావాలు సీఐ సుధాకర్‌ గ్రామస్తులకు వివరించారు. గ్రామ యువతకు వాలీబాల్‌ కిట్‌ అందజేశారు. కార్యక్రమంలో ఎస్సై రాజేందర్‌, సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన

బెల్లంపల్లి: బెల్లంపల్లి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో మంగళవారం పరిసరాల పరిశుభ్రతపై అవగాహన, ప్రచార కార్యక్రమం నిర్వహించారు. కాయకల్ప ప్రోగ్రాంలో భాగంగా పుర వీధుల్లో వైద్యసిబ్బంది ర్యాలీ చేశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, మొక్కలు నాటి కాపాడుకోవాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఏరియా ఆసుపత్రి ఆర్‌ఎంవో డాక్టర్‌ మూర్తి, డాక్టర్‌ వరుణ్‌కుమార్‌, నర్సింగ్‌ సూపరింటెండెంట్‌ జోసెప్పిన్‌, హెడ్‌నర్సులు షీలా, స్టెల్లా, ల్యాబ్‌ టెక్నీషియన్‌ శ్రీనివాస్‌, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

పీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

చెన్నూర్‌రూరల్‌: మండలంలోని సుద్దాల గ్రామంలోని రేషన్‌ దుకాణం వద్ద మంగళవారం పేద ప్రజలకు సన్నబియ్యం పంపిణీ కార్యక్రమంలో ప్రధాని మోడీ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు బుర్ర రాజశేఖర్‌గౌడ్‌, సీనియర్‌ నా యకుడు ఆలం బాపు తదితరులు పాల్గొన్నారు.

‘ఆంక్షలపై పోరాడినందుకే అక్రమ కేసులు’

జన్నారం: టైగర్‌జోన్‌లో ఆంక్షలు ఎత్తివేయాలని, ముందుండి పోరాడినందుకే తనపై అటవీశాఖ అధికారులు అక్రమ కేసులు పెడుతున్నారని మాజీ ఎంపీటీసీ రియాజోద్దీన్‌ ఆరోపించారు. మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కొందరు తనపై తప్పుడు కేసులు పెట్టిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అటవీశాఖలోని ఓ అధికారితో తనకు, తన కుటుంబానికి ముప్పు వాట్లే అవకాశం ఉందన్నారు. ఉన్నతాధికారులు దృష్టి సారించి, న్యాయం చేయాలని కోరారు.

టైగర్‌జోన్‌ పేరిట ఆంక్షలు సరికావు

జన్నారం: మండలంలోని వ్యాపారులకు, రైతులకు టైగర్‌జోన్‌ పేరిట పెడుతున్న ఆంక్షలు సరికావని సామాజిక వేత్త భూమాచారి ఆరోపించారు. మంగళవారం విలేకరులతో మాట్లాడారు. కొందరు ఎన్‌జీవో సభ్యుల ప్రోద్బలంతోనే, ఇక్కడ ఆంక్షలు పెడుతున్నారని ఆరోపించారు. మండల వాసులకు ఇబ్బంది కలిగించేలా ఆంక్షలు విధిస్తే ఊరుకోమని హెచ్చరించారు. సమావేశంలో వివిధ సంఘాల నాయకులు తిరుపతి, శ్రీనివాస్‌, అక్బర్‌, సల్మాన్‌ ఖాన్‌, సతీశ్‌, ఫైమిద్‌ తదితరులున్నారు.

చలివేంద్రాలు ప్రారంభం

లక్సెట్టిపేట: తహసీల్దార్‌ కార్యాలయం ఎదుట పట్టణానికి చెందిన కరిమల వాటర్‌ ప్లాంట్‌ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలి వేంద్రాన్ని జాయింట్‌ కలెక్టర్‌ మోతీలాల్‌ మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్‌ దిలీప్‌కుమార్‌, శ్రీనివాస్‌, సిబ్బంది పాల్గొన్నారు.

చెన్నూర్‌: బస్టాండ్‌ సమీపంలో గల ఓ ప్రైవేట్‌ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సీఐ దేవేందర్‌రావు ప్రారంభించారు. కార్యక్రమంలో వైద్యులు లక్ష్మణ్‌, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బీసీ జేఏసీ నాయకుల నిరసన దీక్ష



నిరసన దీక్షలో బీసీ జేఏసీ నాయకులు

పాతమంచిర్యాల: దేశవ్యాప్తంగా నిర్వహించే జనాభా లెక్కలలో కుల గణన చేపట్టాలని బీసీ జేఏసీ నాయకులు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని గాంధీ పార్కులో ఒక్క రోజు నిరసన దీక్ష చేపట్టారు. బీసీ జేఏసీ జిల్లా అధ్యక్షుడు వడ్డేపల్లి మనోహర్‌ మాట్లాడుతూ 42శాతం రిజర్వేషన్‌లు పెంచుతూ తెలంగాణ ప్రభుత్వం తీర్మానం చేసిందని, ఆ తీర్మానాన్ని ఎన్డీఏ ప్రభుత్వం ఆమోదించాలని డిమాండ్‌ చేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీహక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్‌, సంచార జాతుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వైద్య భాస్కర్‌, బీసీ జేఏసీ చెన్నూర్‌, జైపూర్‌ మండల ఇంచార్జులు గణేష్‌, మల్లేష్‌, బీసీ నాయకులు డాక్టర్‌ రఘునందన్‌, న్యాయవాది కర్రె లచ్చన్న పాల్గొన్నారు.

తుడుందెబ్బ రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయండి



తాండూర్‌: పోస్టర్‌ ఆవిష్కరిస్తున్న నాయకులు

జన్నారం/తాండూర్‌: ఏప్రిల్‌ 12 ,13, 14తేదీల్లో తుడుందెబ్బ ఆధ్వర్యంలో జోడేఘాట్‌లో నిర్వహించే మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ మండిగ రవీందర్‌, జన్నారం మండల అధ్యక్షుడు కాశీ కోరారు. జన్నారం, తాండూర్‌ మండలాల్లో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తుడుందెబ్బ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు ఆదివాసీ హక్కుల సాధన కోసం ఈ మహాసభల్లో చర్చించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర కమిటీ నాయకులు హాజరవుతున్న ఈ మహాసభలకు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. తాండూర్‌లో పోస్టర్‌ ఆవిష్కరించారు. కార్యక్రమాల్లో జన్నారంలో రాయిసెంటర్‌ సార్‌మెడి సోనేరావు, తుడుందెబ్బ జిల్లా కార్యదర్శి నానేశ్వర్‌, తాండూర్‌లో తుడుందెబ్బ మండల అధ్యక్ష, కార్యదర్శులు కుర్సింగ బాబురావు, ప్రధాన కార్యదర్శి యాపల సమ్మయ్య, నాయకులు పాల్గొన్నారు.

‘పులి సంచారంపై వదంతులు’

కాసిపేట: మండలంలోని గోండుగూడ శివారులో కాసిపేట–1 గనిలో పనిచేసే కార్మికులకు మంగళవారం ఉదయం 7.10గంటలకు పెద్దపులి రోడ్డు దాటుతూ కనిపించిందని వదంతులు కలకలం రేపాయి. వాహనాలు నిలిపి చూసినట్లు పుకార్లు సోషల్‌ మీడియాలో చక్కర్లు కొట్టాయి. అప్రమత్తమైన అటవీ అధికారులు, అనిమల్‌ ట్రాకర్‌ను పిలిపించి పరిసరాలు మొత్తం పరిశీలించినా పాద ముద్రలు, ఎటువంటి ఆనవాళ్లు కనిపించలేదు. దీంతో పులి లేదని నిర్ధారించారు. లక్సెట్టిపేట రేంజ్‌ పరిధిలోని చల్లంపేట వద్ద పాదముద్రలు లభించడంతో ఇటువైపు రాలేదని నిర్ధారణకు వచ్చారు. సింగరేణి కార్మికులు వచ్చి వెళ్లే దారిలో పులి, ఇతర అటవీ జంతువులు కనిపిస్తే వెంటనే సింగరేణి అధికారులకు సమాచారం అందించాలని ఫారెస్టు డిప్యూటీ రేంజ్‌ అధికారి ప్రవీణ్‌నాయక్‌ తెలిపారు. ముత్యంపల్లి సెక్షన్‌ పరిధిలోని గొండుగూడ శివారులో పెద్దపులిని చూసినట్లు సమాచారం అందడంతో పరిసరాల్లో ఆనవాళ్లను పరిశీలించగా, ఎటువంటి ఆనవాళ్లు దొరకలేదన్నారు.

గైర్హాజరు కార్మికులకు కౌన్సెలింగ్‌

కాసిపేట: మందమర్రి ఏరియా కాసిపేట 2ఇంక్‌లైన్‌ గనిపై మంగళవారం గని మేనేజర్‌ లక్ష్మినారాయణ గైర్హాజరు కార్మికులకు కౌన్సెలింగ్‌ నిర్వహించారు. నెలలో అండర్‌ గ్రౌండ్‌ ఉద్యోగులు 16మస్టర్లు, సర్ఫేస్‌ ఉద్యోగులు 20మస్టర్ల కంటే తక్కువ ఉన్న కార్మికులకు ఉదయం, మధ్యాహ్నం కౌన్సెలింగ్‌ నిర్వహించారు. గైర్హాజరుతో కార్మికుల కుటుంబాలకు, సంస్థకు నష్టం వాటిల్లుతుందని వివరించారు. 51మంది కార్మికులు కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. కార్యక్రమంలో సంక్షేమాధికారి భార్గవ్‌, అధికారులు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

వేసవి జాగ్రత్తలు పాటించాలి

శ్రీరాంపూర్‌: వేసవిలో వడదెబ్బ తగలకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని సింగరేణి శ్రీరాంపూర్‌ ఏరియా హెల్త్‌ ఆఫీసర్‌ డాక్టర్‌ లోక్‌నాథ్‌ రెడ్డి తెలిపారు. ఆర్కే 7గనిపై మంగళవారం వడదెబ్బపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గుర్తింపు సంఘం ఏఐటీయూసీ ఏరియా ఉపాధ్యక్షుడు కొట్టి కిషన్‌రావు, గని రక్షణాధికారి సంతోశ్‌కుమార్‌ రావు, పిట్‌ సెక్రెటరీ మారుపెల్లి సారయ్య పాల్గొన్నారు.

వృత్తి శిక్షణ కోర్సులు సద్వినియోగం చేసుకోండి



శిక్షణ కేంద్రంలో స్వరూపారాణి

మందమర్రిరూరల్‌: మండలంలోని ఆదిల్‌పేట్‌ గ్రామంలో సింగరేణి సేవాసమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృత్తి శిక్షణ కోర్సుల కేంద్రాన్ని ఏరియా సేవా సమితి అధ్యక్షురాలు, ఏరియా జీఎం సతీమణి స్వరూపారాణి మంగళవారం సందర్శించారు. శిక్షణ కేంద్రంలో శిక్షణ పొందుతున్న వారితో మాట్లాడి అనుభవాలను తెలుసుకున్నారు. శిక్షణ అనంతరం సొంతగా ఉపాధి పొందాలని సూచించారు. ఆమె వెంట లేడీస్‌ క్లబ్‌ మెంబర్స్‌ కవిత, మనీ, సేవామితి ఏరియా కో ఆర్డినేటర్‌ నెల్సన్‌, కమ్యూనికేషన్‌ సెల్‌ కో ఆర్డినేటర్‌ నరేష్‌ శిక్షకురాలు రజిత ఉన్నారు.

నీటి సరఫరా సమయం పెంచాలి

శ్రీరాంపూర్‌: గోదావరి తాగునీటిని సింగరేణి కాలనీలకు కంపెనీ సరఫరా చేసే సమయాన్ని మరింత పెంచాలని టీబీజీకేఎస్‌ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి సురేందర్‌ రెడ్డి, బ్రాంచ్‌ ఉపాధ్యక్షుడు లక్ష్మణ్‌, నాయకులు రమేష్‌, సత్తయ్య, పొగాకు రమేష్‌, అన్వేష్‌ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో యాజమాన్యాన్ని డిమాండ్‌ చేశారు. ప్రస్తుతం 45నిమిషాల పాటు నీటిని అందిస్తున్నారని, వేసవి అవసరాల దృష్ట్యా సరిపోవడం లేదన్నారు. ఇక నుంచి గంటపాటు తాగునీటిని సరఫరా చేయాలని కోరారు.

■ బొగ్గుబాయి వార్తలు

పాలిసెట్‌లో ఉచిత శిక్షణ

శ్రీరాంపూర్‌: సింగరేణి ఆధ్వర్యంలో పాలిసెట్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు శ్రీరాంపూర్‌ ఏరియా డీజీఎం (పర్సనల్‌) అరవిందరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులకు సింగరేణి ఎడ్యుకేషనల్‌ సొసైటీ ఆధ్వర్యంలో సీసీసీలోని సింగరేణి ఉన్నత పాఠశాలలో ఈ శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 10నుంచి శిక్షణ మొదలవుతుందన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థిని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మందమర్రిరూరల్‌: ఈ నెల 10 నుంచి ఏరియాలోని సింగరేణి హైస్కూల్లో సింగరేణి ఎడ్యుకేషన్‌ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత టీఎస్‌ పాలిసెట్‌ బోధన తరగతులు నిర్వహించనున్నట్లు అవకాశాన్ని అర్హులైన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సొసైటీ కార్యదర్శి శ్రీనివాస్‌ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

దీర్ఘకాలిక వ్యాధుల జాబితాలో లివర్‌ సిరోసిస్‌

శ్రీరాంపూర్‌: మెడికల్‌ అటెండెన్స్‌ రూల్స్‌ ప్రకారం దీర్ఘకాలిక వ్యాధుల జాబితాలో లివర్‌ సిరోసిస్‌ చేర్చినట్లు బీఎంఎస్‌ బొగ్గు పరిశ్రమల ఇన్‌చార్జి లక్ష్మారెడ్డి తెలిపారు. డిసెంబర్‌లో రాయపూర్‌లో జరిగిన జేబీసీసీఐ–11లో 4వ స్టాండర్డ్‌డైజేషన్‌ కమిటీ సమావేశంలో తమ యూనియన్‌ తరఫున కోలిండియా యాజమాన్యాన్ని డిమాండ్‌ చేసినట్లు తెలిపారు. చర్చల తర్వాత తమ డిమాండ్‌కు తలొగ్గి, కోలిండియ యాజమాన్యం దీర్ఘకాలిక వ్యాధిగా లివర్‌ సిరోసిస్‌ను గుర్తించి జాబితాలో చేర్చినట్లు తెలిపారు. ఇది బీఎంఎస్‌ సాధించిన విజయమని, అధ్యక్షుడు సత్తయ్య తెలిపారు.

సీఎంఓను కలిసిన ఏఐటీయూసీ నాయకులు

శ్రీరాంపూర్‌: సింగరేణి చీఫ్‌ మెడికల్‌ ఆఫీసర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన డాక్టర్‌ కిరణ్‌రాజ్‌ను గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన ఆసుపత్రిలో మంగళవారం ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కొమిరి రాజ్‌కుమార్‌, శ్రీరాంపూర్‌ బ్రాంచ్‌ కార్యదర్శి షేక్‌ బాజీ సైదా, భూపాలపల్లి ఏరియా ఉపాధ్యక్షులు కిరణ్‌ కుమార్‌ ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

కంటి వైద్య శిబిరానికి స్పందన

బెల్లంపల్లి: బెల్లంపల్లి లయన్స్‌ క్లబ్‌ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించగా ప్రజల నుంచి స్పందన లభించింది. శాంబవి ఐ విజన్‌ సెంటర్‌ ఆవరణలో నిర్వహించిన శిబిరంలో 90మందికి కంటి పరీక్షలు చేశారు.కార్యక్రమంలో లయన్స్‌ క్లబ్‌ నిర్వాహకులు సత్యనారాయణ, రాజన్న, కంటి పరీక్ష నిపుణుడు అంజయ్య, రాజలింగు, శ్రీధర్‌స్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

డీడీఎం పోస్టు భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

మంచిర్యాలటౌన్‌: జిల్లాలో ఒప్పంద ప్రాతిపదికన జాతీయ ఆరోగ్య మిషన్‌(ఎన్‌హెచ్‌ఎం)లో మంజూరైన డిస్ట్రిక్ట్‌ డాటా మేనేజర్‌(డీడీఎం) ఖాళీగా ఉన్న పోస్టు(1) భర్తీ చేసేందుకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ నోటిఫికేషన్‌ విడుదల చేసినట్లు డీఎంహెచ్‌వో డాక్టర్‌ హరీశ్‌రాజ్‌ ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 8వ తేదీ నుంచి 11వ తేదీ వరకు ఉదయం 10:30గంటల నుంచి సాయంత్రం 5గంటల్లోపు దరఖాస్తులను జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో అందించాలని తెలిపారు.